
జన్మదిన శుభాకాంక్షలు
Happy Birthday
అభిమానం ఆయన అభిమతం...
మనస్సు విప్పి మాట్లాడే సంస్కారం...
పిలిస్తే పలికే మనస్తత్వం...
అడిగిన వెంటనే ఆపన్న హస్తం అందించే
సహృదయం గల మా శ్రేయోభిలాషి
శ్రీ కె.జె.కుమార్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
ఇట్లు...
నగరి నియోజకవర్గ
ప్రజలు మరియు అభిమానులు

క్లుప్తంగా

శరవేగంగా ప్యాచ్ వర్కులు



రోడ్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నగరి: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఛిద్రమైన రోడ్లకు శరవేంగా ప్యాచ్ వర్కు చేపట్టారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న గుంతలు, ఛిద్రమైన ప్రాంతాలలో తారు, కంకరతో ప్యాచ్‌వర్క్ చేసి వాహన దారుల ఇబ్బందులను తొలగించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న అధికారి

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులకు సోమవారం పుత్తూరు బీసీ హాస్టల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి మునీంద్రయ్య చేతుల మీదుగా 10 తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ గణితాన్ని సులువైన పద్ధతిలో నేర్చుకోడానికి ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్ చార్జి వార్డెన్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఏకవీర ఫౌండేషన్ చేయూత



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న ప్రతాప్ స్వామి

తిరుపతి కల్చరల్: ఏక వీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి తిరుపతి జిల్లాలోని సుమారు 200 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందజేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా నరసింహ తీర్థం రోడ్డులోని పద్మావతి మహిళా ప్రార్థన ప్రాంగణంలో సోమవారం ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం మంగళ, బుధవారాల్లోనూ నిర్వహిస్తామని ప్రతాప్ స్వామి తెలిపారు. కృత్రిమ అవయవాలు అవసరమైన వారు తమను సంప్రదించాలని కోరారు. ఎస్వీయూ మాజీ వీసీ రాళ్లపల్లి రామ్మూర్తి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈ-క్రాప్ బుకింగ్

రామచంద్రాపురం: ఈ-క్రాప్ బుకింగ్ పకడ్బందీగా నిర్వహించినట్లు జేసీ బాలాజీ తెలిపారు. ఆయన సోమవారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లుతో కలిసి పీవీపురం, కేకేవీపురం, సొరకాయలపాలెం గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఆయన ఈ- క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందవచ్చని తెలిపారు. ఏఓ స్రవంతి, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి 19 వరకు టీటీడీ ఉద్యోగుల క్రీడలు

తిరుపతి అలిపిరి : ఫిబ్రవరి 2 నుంచి 19 వరకు టీటీడీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు టీటీడీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్లో సోమవారం కారు పిట్టగోడను ఢీకొంది. కర్ణాటక చెందిన భక్తులు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. రెండో మలుపు వద్ద కారును అదుపు చేయలేక పక్కనే ఉన్న పిట్టగోడపైకి ఎక్కించారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘాట్ రోడ్డు సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించారు.

75 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బుపెట్టి పేకాట ఆడడం తదితర నేరాలకు పాల్పడిన 75 మందికి రూ.86,850 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

పోటెత్తిన కన్నడ భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని ఏకం ఆలయానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వివిధ ప్రాంతాల భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఇక్కడికి కన్నడ భక్తులు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉదయం 8 నుంచి ఆలయంలో మధ్యాహ్నం 2 గంటల వరకు దాదాపు 20వేల భక్తులు అమ్మాభగవాన్‌ను దర్శించుకున్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడప'లోనూ సంతోషం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



కేవీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

విజయపురం: ప్రభుత్వం పార్టీలకతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు గడప గడపలోనూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆమె సోమవారం కేవీపురం పంచాయతీ కేవీపురం, దళితవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కేవీపురం పంచాయతీ అభివృద్ధిని టీడీపీ నాయకులు పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం సున్నా వడ్డీ పథకాన్ని అమలు ఇస్తున్నామని మంత్రి అన్నారు. వలంటీర్లు నిరంతరం అర్హులైన అందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో వద్ధులు పెన్షన్ తీసుకోవడానికి గ్రామ సచివాయాలకు వచ్చి సొమ్మసిల్లి పడిపోయేవారని చెప్పారు. ఇప్పుడు ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంత్రిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవికుమార్, సీఐ రాజశేఖర్, తహసీల్దార్ అమరేంద్రబాబు, వైస్ ఎంపీపీ బాలాజీ, దరశథరాజు, మండల కన్వీనర్ గోపినాథ్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఆనందన్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, బాలకృష్ణమనాయుడు, అరుణాచలం, రమేష్‌రెడ్డి, సుధాకర్, రజినీ, ప్రసన్న, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: మండలంలోని వేలావడి కాలనీకి చెందిన సోము ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూరైంది. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి మృతుని భార్య లైలాకు వైఎస్సార్ బీమా సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ చంద్రకళ, నాయకులు వేలాయుధం, కో-ఆప్షన్ సభ్యులు దస్తగిర్, యేసు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



నియామక పత్రాన్ని అందుకుంటున్న మునివేల్ మాదిగ

పుత్తూరు రూరల్: స్థానిక అంబేడ్కర్ భవనంలో సోమవారం ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ కో-ఆర్డినేటర్ నరేంద్రబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో మాదిగలను భాగస్వాములను చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ పుత్తూరు మండల కన్వీనర్‌గా పి.మునివేల్ మాదిగను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కో-కన్వీనర్లు వినోద్‌కుమార్ మాదిగ, నవీన్ మాదిగను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కన్వీనర్ రాజేంద్ర మాదిగ, జిల్లా నాయకులు గోపి మాదిగ, వాసుదేవ మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో రేపు భీష్మ ఏకాదశి పూజలు

శ్రీకాళహస్తి: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఉదయం 9.30గంటలకు ఊరేగింపుగా స్వామి అమ్మవార్లు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బాబు అగ్రహారం వద్ద ఉన్న కుమారస్వామి తిప్పవద్దకు చేరుకుంటారన్నారు. అక్కడ స్వామివారికి విశేష పూజలు నిర్వహించి మధ్యాహ్నం 3గంటలకు తిరిగి ఆలయానికి చేరుతారన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండల కేంద్రంలోని సచివాలయం-1లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్ కోరారు. కొత్త ఆధార్ కార్డులు తీసుకోదలచిన వారు, ఆధార్ కార్డులో మార్పులు-చేర్పులు చేసుకోదలచిన మండల ప్రజలు ఆధార్ కేంద్రానికి పనివేళల్లో రావాలని కోరారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



నింద్రలో వైద్య సిబ్బంది ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నింద్ర: కుష్టు రహిత దినోత్సవం పురస్కరించుకుని సోమవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కళ్యాణి మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ర్యాలీలో వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం

నగరి: కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని నోడల్ ఆఫీసర్ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో ఆయన పర్యటించారు. కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి, డీపీఎంవో మునిసుబ్బారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని వినియోగదారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు వినియోగదారుల హక్కుల రక్షణలో చొరవ తీసుకొని సేవలు అందించాలని కోరారు. రాస్ ప్రతినిధి మోహన్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సేవ చేస్తే తప్పక ప్రతిఫలం ఉంటుందన్నారు. అనంతరం విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు భారతీయ విశ్వ సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఎస్వీయూ విశ్రాంత ప్రిన్సిపాల్ రెడ్డెప్పరెడ్డి, ఆయుర్వేద వైద్యుడు జగన్నాథ్, భారతీయ సేవా సంస్థ నిర్వాహకులు రాజా, భారతి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి 'ఉపాధి' ఊతం

శ్రీకాళహస్తి రూరల్: ఉపాధి హామీ పథకం పల్లె ప్రగతికి ఎంతో తోడ్పడు తోందని, ప్రతి కుటుంబమూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలని డ్వామా పీడీ సీహెచ్.శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి పంచాయతీలో పంట కాలువ పనులను ఆయన తనిఖీ చేశారు.కూలీలు, రైతులతో మాట్లాడారు. ఉపాధి పనులు చేస్తున్న తీరును తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఈ కాలువలు పూర్తిగా పూడిపోయి పొలాలకు నీరు అందక ఇబ్బంది పడ్డామని చెప్పారు. అయితే ఉపాధి పనుల వల్ల సమస్య తీరడమేకాకుండా గ్రామంలోనే తమకు పనులు లభిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని పంట కాలువ పనులు చేసి రైతాంగానికి సమస్యలు లేకుండా చూడాలని ఉపాధి సిబ్బందిని కోరారు. సహాయ పథక సంచాలకులు ప్రేమ్ కుమార్, ఏపీఓ క్రిష్టయ్య, జీఐఎస్ కో-ఆర్డినేటర్ గుణశేఖర్, ఈసీ మునిశేఖర్, మేట్ చిరంజీవి పాల్గొన్నారు.

పుష్ప సోయగం



పూల పరిమళానికి పులకరించని వారు ఉండరు. అందుకే పూలమాలకు తలవంచని ధీమంతుడెవడు అని ఒక కవి అన్నారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల రోడ్డు, రాస్ బిల్డింగ్ వద్ద ఉన్న టర్బుయా రోసి పింక్ చెట్లు ఎర్రటి పూలను విరబూసి చూపరుల హృదయాలను రంజింపజేస్తున్నాయి. ఇవి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పూలు పూస్తాయి. అటుగా నడుచుకుంటూ వెళ్లే వారు ఆ చెట్లలోని పూలను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ సెల్ఫీలు, మొబైల్‌లో ఫొటోలు తీసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామిరెడ్డి

నగరి: అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక దుకాణదారులు, ఫ్లెక్సీ తయారీదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించినట్లు వివరించారు. ఈ కమిటీలో తనతోపాటు మున్సిపల్ మేనేజరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, టౌన్ ప్లానింగ్ ఆఫీసరు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజినీరు ఉంటారని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో అడ్మిన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, శానిటరీ సెక్రటరీ, మహిళా పోలీసు ఉంటారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలపై నిషేధంలో అమల్లో ఉందని గుర్తుచేశారు. ప్లాస్టిక్, ఫ్లెక్సీ మెటీరియల్ తయారుచేయడం, దిగుమతి చేసుకోవడం, నిల్వ ఉంచడం నేరమన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి ఫ్లెక్సీ ఏర్పాటుచేస్తే చదరపు అడుగుకు రూ.100 చొప్పున అపరాధరుసుము వసూలు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు పర్యటించి తనిఖీలు నిర్వహించి ప్రతి రోజు నివేదికను మునిసిపల్ కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ అథారిటీకి అందజేయాలని స్పష్టం చేశారు. ఫ్లెక్సీ తయారీదారులు, రీటైల్ వ్యాపారులు, వ్యాపార సంఘాలవారు నిబంధనలు పాటిస్తూ ప్లాస్టిక్ నిషేధానికి సహకారం అందించాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నింద్ర: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ మన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. మంత్రి రోజా నాయకత్వంలో అందరూ కలిసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుబా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో-ఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ విజేష్, జిల్లా మహిళ కార్యదర్శి మేరి, సింగిల్ విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు దామోదరం , నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు మాతృవియోగం



హరిని పరామర్శిస్తున్న కుమారస్వామిరెడ్డి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపల్ చైర్మన్ ఏ.హరి తల్లి ఆనంగి మునెమ్మ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. విషయం తెలుసుకొన్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు వై.కుమారస్వామిరెడ్డి, వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పుత్తూరుకు వచ్చి మునెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మునివేలు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునెయ్య, దిలీప్ మొదలి, ఏకాంబరం, చిట్టిబాబు, జనార్దన్‌యాదవ్, మోహన్‌రెడ్డి, అన్నాలోకనాథం, నరసింహారావ్, ప్రసాద్, శ్యామ్‌లాల్, కమతం ప్రకాష్, చీరాల, సుదర్శనం , ప్రభు తదితరులు ఉన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవ శోభతో ఉత్సవమూర్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి నిత్య కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లను పలు రకాల సుగంధ పుష్పాలతో అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం గణపతి, నవగ్రహ, యజ్ఞోపవీత, మాంగల్యపూజలు చేయడంతోపాటు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ సాగర్‌బాబు



మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ పాలకమండలి, అధికారులు కృషి చేస్తున్నారు. దీనికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ధూర్జటి కళాప్రాంగణం వద్ద పనులు వేగవంతం చేశారు. అలాగే పట్టణ పలు ప్రధాన మార్గాల్లో ఆర్చ్‌లను, ఆలయ సమీపంలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు.

ఏర్పాట్లపై ఈఓ సమీక్ష

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆలయంలోని పరిపాలన భవనంలో ఈఓ సాగర్‌బాబు ఆలయ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కలసికట్టుగా విజయవంతం చేయాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలన్నారు.



తిరుపతిలో పాప్ కార్న్ చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న పాప్‌కార్న్ హీరో సాయి రోనాక్

తిరుపతి కల్చరల్: పాప్ కార్న్ చిత్రం సరికొత్త ట్రెండ్ జోనర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని హీరో సాయి రోనాక్ తెలిపారు. ఆచార్య క్రియేషన్స్ ఆధ్వర్యంలో మురళి గంధం దర్శకత్వంలో రూపొందించిన పాప్ కార్న్ ఫిబ్రవరి 10న విడుదల కానుంది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఎంఆర్ పల్లి, న్యూబాలాజీ కాలనీలోనున్న ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలకు వచ్చింది. హీరో సాయి రోనాక్, హీరోయిన్ అవికా గోర్ మీడియాతో మాట్లాడుతూ పాప్ కార్న్ మంచి లవ్‌స్టోరీ సినిమా అని తెలిపారు. దర్శకుడు మురళి గంధం మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక ప్రేమ కథా చిత్రాలు వచ్చాయని, తాము నిర్మించిన ఈ చిత్రం డిఫరెంట్ జోనర్‌లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్రం నిర్మాతలు చలపతి, భోగేంద్ర గుప్త తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్కం డ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేశారు. వేకువజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం పాలాభిషేకం చేశారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లింగ అసమానతలు అభివృద్ధికి అడ్డంకులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నీరజ

కార్వేటినగరం: ప్రతి మహిళలోను అమ్మను చూడాలని పద్మావతి మహిళా వర్సిటీ మహిళా విద్య విభాగాధిపతి నీరజ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సీఎస్ లత ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. లింగ అసమానతలు అభివృద్ధికి అడ్డంకులని తెలిపారు. ప్రిన్సిపాల్ విజయులురెడ్డి మాట్లాడుతూ మహిళలను అందరితో సమానంగా చూడాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశన్, ప్రీతి, జేకేసీ మెంటార్ లోకేశ్వర్ పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి పంచలోహ కవచాలు


పంచలోహ కవచాలను అందజేస్తున్న దాతలు లలితా దేవరెడ్డి కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి స్థానికులు లలితా దేవారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం పంచలోహ కవచాలు అందజేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి తెలిపారు. లలితా దేవారెడ్డి కుటుంబ సభ్యులు గతంలో కూడా సుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుమారాచారి, పయణిరెడ్డి, ఎంపీటీసీ చంద్రమ్మ, కర్పగం, చెంగమ్మ, దీపక్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

ఈ- క్రాప్ బుకింగ్‌తోనే పథకాలకు అర్హత


ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏవో ఢిల్లీ ప్రసాద్

పాలసముద్రం: రైతులు పంటలు ఈ -క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని ఏవో ఢిల్లీప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం ఆముదాల, బాలక్రిష్టాపురంలో ఈ- క్రాప్ బుకింగ్‌ను పరిశీలంచారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ క్రాప్ చేసుకోవాలన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ


దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ మాధవి, వలంటీర్ మూర్తి

పాలసముద్రం: బయటకు వెళ్లినప్పుడు సోదరుడు పక్కన ఉంటే ఎంత ధైర్యంగా ఉంటుందో సెల్‌ఫోన్‌లో దిశయాప్ ఉంటే అలా భద్రత ఉంటుందని ఏఎస్ఐ మురుగేష్ తెలిపారు. బలికకండ్రిగ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ మాధవి, వలంటీర్ మూర్తి మాట్లాడుతూ అత్యవసర సమయంలో దిశ యాప్ ద్వారా సాయం పొందవచ్చన్నారు.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- పెద్దకాల్వలో గడప గడపకూ మన ప్రభుత్వం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకూ నవరత్నాల పథకాలు అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. ఆయన సోమవారం పెద్దకాల్వ గ్రామ సచివాలయం పరిధిలోని సుందరరాజపురం, ఎన్టీఆర్ కాలనీ, చెర్లోపల్లి, ఎస్సీకాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇళ్లు రాని వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణాల మాఫీ, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ చేయూత పథకాలు అమలుచేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా ఇంటి వద్దే పింఛను అందజేస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయాలను, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి వద్దే అందజేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. పేదలు విద్యావంతులైతేనే ఆర్థికాభివృద్ధి కలుగుతుందని భావించి ప్రతి బిడ్డనూ ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో సీఎం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. చంద్రబాబునాయుడు హామీలు నెరవేర్చకపోవడంతోనే 2019 ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ.విజయానందరెడ్డి, ఎంపీపీ అనితారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, ఎంపీటీసీ దుర్వాసులు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, సురేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పెద్దారెడ్డి, వెంకటరెడ్డి, హేమచంద్రారెడ్డి, ఆలీషేర్‌ఖాన్, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దారు ఇన్బనాథన్ పాల్గొన్నారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు


కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

శ్రీరంగరాజపురం: మండలంలోని పెద్దతయ్యూరు దళితవాడలో వాగుపై కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా తయ్యూరు సర్పంచ్ వరదమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు వెళ్లాలంటే వాగు దాటాల్సి వచ్చేదన్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పిల్లలు, తల్లిదండ్రులు భయాందోళన చెందేవారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం కాంక్రీటు పనులు చేపట్టారు. ఆమె ఎంపీపీ సరితతో కలిసి పనులను ప్రారంభించారు. ఏఈ మునిరాజులు, పంచాయితీ కార్యదర్శి జ్యోత్స్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్, మాజీ సర్పంచ్ బాబు, సుబ్బనాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ స్పందనకు 12 అర్జీలు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ షబ్బీర్ బాష

శ్రీరంగరాజపురం: స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తహసీల్దార్ షబ్బీర్‌బాష ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 7 భూ తగాదాలు, 3 శ్మశానానికి భూమి కేటాయింపు, రెండు 50 బళిరెడ్డిపల్లి, గొల్లఇండ్లు గ్రామాలకు రాహదారి సౌకర్యం కల్పించాలని అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో, సర్వేయర్లకు సూచించారు. మండల సర్వేయర్ మురళి, ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం


కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కార్వేటినగరం: కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాగి రంగు కలిగిన స్పర్శ లేని మచ్చలుంటే వెంటనే ఆశా కార్యకర్త లేదా ఏఎన్ఎంలకు తెలిపాలని సూచించారు. డీపీఎంవో డాక్టర్ యుజుస్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే ఎండీటీ మందుల ద్వారా ఆరు నుంచి 12 నెలల లోపు నయం చేయవచ్చన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే శరీర అవయవాలు కుంటుపడే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీహెచ్ఈవో వెంకటరమణరాజు, మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కరయ్య, పాఠశాల హెచ్ఎం వైవీ వసుమతీదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్షుడిగా రవీంద్రనాథ్


రవీంద్రనాథ్, విజయకుమార్

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ టీఎఫ్ ఎన్నికలు సోమవారం జీడీనెల్లూరులో ఏకగ్రీవమయ్యాయి. మండల అధ్యక్షుడిగా రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా విజయకుమార్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోశాధికారిగా రాజేంద్రరెడ్డి, మహిళా కార్యదర్శిగా ప్రతిభ ఎన్నికయ్యారు. వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యువరాజారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

శ్యామ్‌ప్రసాద్ రెడ్డి గెలుపునకు కృషి


పచ్చికాపల్లంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వెదురుకుప్పం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు రమణారెడ్డితో కలిసి పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో అందరూ సుభిక్షంగా ఉన్నట్లు తెలిపారు. సీఎం సేవలను గుర్తించి పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. మాంబేడు, కొమరగుంట, వెదురుకుప్పం, బ్రాహ్మణపల్లె, పెరుమాళ్లపల్లె, తిరుమలయ్యపల్లె, ప్రాతగుంట గ్రామ సచివాలయ పరిధిలో ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, డైరెక్టర్ సురేష్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ గుణశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు రోశిరెడ్డి, గురవారెడ్డి, సర్పంచ్ భువనేశ్వరి, ఉప సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ప్రకాష్, సుమతి పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న మునేంద్రయ్య

పాలసముద్రం: ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే.మునేంద్రయ్య తెలిపారు. ఆయన సోమవారం వెంగళరాజు కుప్పం బాలుర బీసీ హాస్టల్, పాలసముద్రం బాలికల బీసీ హాస్టల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని వార్డెన్లు కోటేశ్వరన్, హేమలతకు సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, రిజిస్టర్లను పరిశీలించారు.

గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పనిచేయాలి


గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతున్న డీఎఫ్‌టీసీ జేమ్స్

పాలసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ ఎస్ విద్యావతి, జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ జేమ్స్ తెలిపారు. వారు సోమవారం వనదుర్గాపురం పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వాటిని సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి ఎరువులు తయారు చేయాలని సూచించారు. ఎరువులను రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు తలనీలాల వేలం

వడమాలపేట: మండల పరిధిలోని సదాశివకోనలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాలు పోగు చేసుకొనే హక్కు కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వడమాలపేట అంజనేయస్వామి ఆలయంలో ఫిబ్రవరి1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం ఉంటుందని చెప్పారు. పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలంలో ఈ హక్కు దక్కించుకున్నవారు సదాశివకోనలో ఫిబ్రవరి 17 నుంచి 19 వతేదీ వరకు తలనీలాలను పోగు చేసుకోవచ్చని తెలిపారు.

దళితులను మోసం చేసింది టీడీపీనే


విలేకరులతో మాట్లాడుతున్న దళిత నాయకులు

శ్రీరంగరాజపురం: దళితులు రాజకీయంగా, సామాజికంగా ఎదగనీయకుండా మోసం చేసింది టీడీపీనే అని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. దళిత కుటుంబంలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబునాయుడు దళితులను కించపరిచారని దుయ్యబట్టారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన గంగాధర నెల్లూరుకు టీడీపీ ఇన్‌చార్జిగా చిట్టిబాబు నాయుడిని బాధ్యతలు అప్పగించి దళితులను అవమానించారని ఆరోపించారు. దళితులు ఇన్‌చార్జి బాధ్యతలకు పనికిరారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ దళితులకు రాజకీయంగా, సామాజికంగా, పెద్ద పీట వేసిందని తెలిపారు. ఇందులో భాగంగానే నారాయణ స్వామిని డిప్యూటీ సీఎంగా చేసినట్టు తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దీన్ని చూసి ఓర్వలేక చిట్టిబాబు నాయుడు, టీడీపీ నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. దళితులపై ప్రేమ ఉంటే చిట్టిబాబు నాయుడు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసి దళితులకు అప్పగించాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్ నాగరాజుశెట్టి, జనార్దన్, ముత్తగన్, మణి, రామ్మూర్తి, అల్లిముత్తు, హరిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.